



పూజలకు సిద్ధమైన ఉత్సవ విగ్రహాలు

రథోత్సవానికి వేళాయె..

● జగన్నాథుని ఉత్సవాలకు సర్వం సిద్ధం ● నేటి నుంచి రథయాత్ర ప్రారంభం ● ముస్తాబైన ఆలయాలు

● ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారుల ● ప్రత్యేక పూజలకు సన్నద్ధమైన భక్తులు

పార్వతీపురం టౌన్/సాలూరు/పాలకొండ, జూలై 6: జగన్నాథుని ఉత్సవాలకు సర్వం సిద్ధమైంది. రథయాత్రకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇప్పటికే జిల్లాలో ప్రధాన ఆలయాలు, రథాలను ముస్తాబు చేశారు. నేటి నుంచి స్వామి వారి తొలి రథయాత్ర నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు భారీగా తరలి రానున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆదివారం నుంచి మారు రథయాత్ర వరకూ రోజుకో అవతారంలో స్వామి వారు దర్శనమిస్తారు.. రథంపైన కొలువుదీరే సుభద్ర, జగన్నాథస్వామి, బలభద్రుడు ఉత్సవ విగ్రహాలను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నారు.

● పార్వతీపురం పట్టణంలోని ప్రధాన ఆలయంలో ఉదయం 10 గంటలకు జిల్లా గ్రూపు దేవాలయాల ఈవో ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పాతబస్టాండ్ కూడలి నుంచి గుడించా మందిరం వరకు మేళతాళాల మధ్య రథయాత్ర కొనసాగనుంది. గుడించా మందిరంలో స్వామి వారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమిస్తారు. మారు రథయాత్ర రోజున తిరిగి స్వామి వారిని ప్రధాన ఆలయానికి తీసుకొస్తారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

● సాలూరు పట్టణంలో రథయాత్ర ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, రాజవంశీయుడు యువరాజు ఆధ్వర్యంలో ఇప్పటికే గుడించా మందిరం, ప్రధాన ఆలయం, రథాన్ని ప్రత్యేక పూజలకు సిద్ధం చేశారు. తొమ్మిది రోజుల పాటు జరిగే జగన్నాథుని ఉత్సవాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనున్నారు.



పార్వతీపురం పట్టణంలో సిద్ధమైన రథం

పూరి తరహాలోనే..

ఒడిశాలోని పూరి తరహాలోనే పాలకొండలో కొన్నేళ్లుగా రథయాత్ర చేపట్టడం ఆనవాయితీగా వస్తుంది. ఈ యాత్రను తిలకించేందుకు శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో దేవదాయశాఖాధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే ప్రధాన ఆలయానికి పూర్తిస్థాయిలో పెయింటింగ్ వేసి.. విద్యుత్ దీపాలతో అలంకరించారు. మరోవైపు భక్తుల కోసం ఆలయ ప్రాంగణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. గడిచిన ఐదేళ్లలో అనుకున్న స్థాయిలో రథయాత్ర ఉత్సవాలు జరగలేదు. అసౌకర్యాల నడుమే భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అయితే ఈ సారి అలా జరగకుండా చూడాలని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, టీడీపీ నాయకులు పల్లా కొండలరావు, గంటా సంతోష్‌కుమార్ తదితరులు దేవదాయశాఖాధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు.



సాలూరులో..

వివిధ అవతారాల్లో స్వామి దర్శనం..

ఈ నెల 7న మొదటి రథయాత్ర(తొలిదశమి), 8న ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయి. 9న స్వామివారు మత్స్యావతారం, 10న కూర్మావతారం, 11న వరహా నరసింహ అవతారం (హిరాపంచమి), 12న వాహన, పరశురామ అవతారం, 13న రామ, బలరాం అవతారం, 14న కల్కీ, జగన్మోహిని అవతారాల్లో జగన్నాథుడు భక్తులకు దర్శనమివ్వనున్నట్లు పాలకొండ ఆలయ కార్యనిర్వహణాధికారి సర్వేశ్వరరావు, ప్రధాన అర్చకులు విశ్వనాథ్‌దాస్ తెలిపారు. 15న మారు దశమి (నిజరూప దర్శనం), 16న మారు రథయాత్ర ఉంటుందన్నారు.



పాలకొండలో...

చెరువు కాదండోయ్..

పార్వతీపురం నుంచి ఒడిశా రాష్ట్రం రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి చెరువును తలపిస్తోంది. శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి ఆ రోడ్డు ఇలా మారింది. దారి పొడవునా ఏర్పడిన భారీ గోతుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో రహదారి ఎక్కడుందో తెలియని పరిస్థితి నెలకొంది. గోతుల్లో నీరు నిలిచిపోవడంతో ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహన చోదకులు వాపోతున్నారు. ఒక్కోసారి గోతుల్లో జారి గాయాలపాలవ్వాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరచూ ఈ మార్గంలో ప్రమాదాలు సంభవిస్తున్నా.. అధికారులు స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జిల్లా పరిధిలోని అంతర్రాష్ట్ర రహదారిలో గోతులను పూడ్చాలని వారు కోరుతున్నారు.

- గరుగుబిల్లి



పీహెచ్‌సీల్లో మందులన్నీ ఉండాలి

● ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో విజయపార్వతి

మక్కువ: మలేరియా, టైఫాయిడ్ నివారణ మందులన్నీ పీహెచ్‌సీల్లో ఉండా లని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో కె.విజయ పార్వతి ఆదేశించారు. శని వారం మక్కువ, శంబర పీహెచ్‌సీల్లో మందుల నిల్వలను పరిశీలించారు. సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పల్లెవాసులకు అందుబాటులో ఉండాలని సూచించారు. మాతాశిశు మరణాల నివారించాలన్నారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు జరిగేలా చూడాలని, వసతిగృహాల్లో వైద్య పరీక్షలు చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. డీఎంవో టి.జగన్మోహన్‌రావు, వైద్యాధికారులు హరికృష్ణ, కిరణ్‌కుమార్ ఉన్నారు.



మక్కువ పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో , డీఎంవో తదితరులు

గుణానుపురంలో గజరాజులు

కొమరాడ, జూలై 6 : గత కొద్ది రోజులుగా నాగావళి నదికి తూర్పు వైపున సంచరించిన గజరాజులు శనివారం కొమరాడ మండలానికి వచ్చాయి. గుణానుపురం, పరశురాంపురం గ్రామాల మధ్య హల్‌చల్ చేశాయి. దీంతో ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతందోనని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇదిలా ఉండగా ఆయా గ్రామాల్లో అరటి, పత్తి, మొక్కజొన్న, కూరగా యాల పంటలను ఏనుగులు నాశనం చేసే అవకాశం ఉందని మరోవైపు రైతులు వాపోతున్నారు. తక్షణమే అటవీ శాఖ అధికారులు స్పందించి ఈ ప్రాంతం నుంచి గజరాజులను తరలించే చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



గుణానుపురం సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

ధరల నియంత్రణకు చర్యలు: జేసీ

పార్వతీపురం, జూలై 6(ఆంధ్రజ్యోతి): నిత్యావసర సరుకుల ధరల నియం త్రణకు చర్యలు తీసుకోవాలని జేసీ శోభిక ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్లు, హోల్‌సేల్ డీలర్లతో సమీక్షించారు. వినియోగదారులకు సరసమైన ధరలకు నిత్యావసరాలను అందించే వారిని గుర్తించి.. తమకు నివేదిక ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు వస్తు వుల విక్రయాలు చేపట్టరాదన్నారు. విధిగా నిబంధనలు పాటించాలన్నారు. సమా వేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శివప్రసాద్, మార్కెటింగ్‌శాఖ డీడీ అశోక్‌కుమార్, లీగల్ మెట్రాలజీ అధికారి కె.రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేసీ శోభిక

కొత్త కలెక్టర్‌పైనే ఆశలు

● నేడు బాధ్యతలు స్వీకరించనున్న శ్యాంప్రసాద్

● జిల్లాలో ఎన్నో సమస్యలు

పార్వతీపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా నూతన కలెక్టర్‌గా ఎ.శ్యాంప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు పనిచేసిన కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు బదిలీ అయింది. పల్నాడు జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తున్న శ్యాంప్రసాద్ పదోన్నతిపై కలెక్టర్‌గా ఇక్కడకు వస్తున్నారు. అనకాపల్లికి చెందిన ఆయన గతంలో శ్రీకాకుళం జిల్లా టెక్కలి ఆర్డీవోగా, చిత్తూరు జిల్లాలోని కుప్పం అధికారిగా పని చేశారు. రాష్ట్రస్థాయిలో కూడా ఉన్నతాధి కారిగా విధులు నిర్వహించారు. ఆయన అపార అనుభవం పార్వతీపురం మన్యం జిల్లా అభివృద్ధికి ఎంతో ఉపయోగపడుతుందని జిల్లావాసులు భావిస్తున్నారు.



కలెక్టర్ శ్యాంప్రసాద్

సమస్యల స్వాగతం..

కొత్త కలెక్టర్‌కు జిల్లాలో పలు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. ప్రధానంగా గత ఐదేళ్ల వైసీపీ పాలనలో జిల్లాలో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. జగన్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయక పోవడంతో గత కలెక్టర్ నిశాంత్‌కుమార్ కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే కొన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన ప్రాంతాల్లో కొన్ని చోట్ల మాత్రమే సెల్‌టవర్లు ఏర్పాటు చేశారు. నిరుద్యోగ యువతకు ఉపయోగపడే విధంగా అభిలాష తదితర కార్యక్రమాలను నిర్వహించారు. రైతులకు సకాలంలో విత్తనాలు అందించంతో పాటు ధాన్యం కొనుగోలు, విద్య వైద్యం, సాగునీరు తదితర మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించారు. అయితే, ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో జిల్లాలోని సమస్యల పరిష్కారానికి నూతన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పార్వతీపురానికి బైపాస్ రహదారి, జిల్లాకేంద్రంలో చేపడుతున్న ఆసుపత్రి భవన నిర్మాణాలను పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో సదుపాయాలు మెరుగుపరిచి పూర్తిస్థాయిలో రోగులకు వైద్యసేవలు అందేలా చూడాలి. ప్రభుత్వ వైద్య కళాశాలకు స్థల పరిశీలన పూర్తయినా కనీసం శంకుస్థాపన జరగలేదు. కలెక్టర్ కార్యాలయానిది కూడా ఇదే పరిస్థితి. తాగునీరు, డంపింగ్ యార్డు సమస్యలు కూడా పరిష్కరించాల్సి ఉంది. వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా మారిన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి. పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ద్వారా గిరిజనులకు పూర్తి స్థాయిలో సేవలు అందించాల్సి ఉంది. సీతానగరంలో వంతెనతో పాటు పూర్ణపాడు-లాబేసు వంతెనల నిర్మాణాలను పూర్తి చేయాల్సిన బాధ్యత కొత్త కలెక్టర్ శ్యాంప్రసాద్‌పై ఉంది.

గంజాయిపై ఉక్కుపాదం



● వంద రోజుల్లో ఫలితం కనిపించాలని మంత్రివర్గ నిర్ణయం

● ఒడిశా నుంచి దిగుమతి కట్టడికి చెక్‌పోస్టుల పటిష్టత ఎంతో అవసరం

● వాటిపై దృష్టి సారిస్తేనే సత్ఫలితాలు.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం

పార్వతీపురం, జూలై 6 (ఆంధ్రజ్యోతి): గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను పూర్తిగా అరికట్టాలని టీడీపీ కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వంద రోజుల్లో దీని ఫలితం ఉండాలని మంత్రివర్గం నిర్ణయించింది. ప్రధానంగా ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా గంజాయి రవాణా, విక్రయాలు జరగకుండా చూడాలని క్షేత్రస్థాయిలో అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. 'మన్యం' పరిధిలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. అయితే జిల్లాలో ఒడిశా నుంచి దిగుమతి అవుతున్న గంజాయిని కట్టడి చేయాలంటే చెక్‌పోస్టులు ఎంతో కీలకం. వాటిని మరింత పటిష్టపరిస్తేనే.. ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో పార్వతీపురం, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం, పాచిపెంట, సాలూరు, భామిని తదితర మండలాలు ఏవోబీ సరిహద్దుకు దగ్గరలో ఉన్నాయి. ఒడిశా గ్రామాల నుంచి ఆయా ప్రాంతాల మీదుగా యథేచ్ఛగా గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు జరుగుతున్నాయి. దీనిని అరికట్టాలంటే చెక్‌పోస్టుల వద్ద పటిష్ట బందోబస్తుతో పాటు 24 గంటల పాటు నిఘా ఏర్పాటు చేయాల్సి ఉంది. పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమించాల్సి ఉంది. ఉన్నతాధికారులు పర్యవేక్షణ కూడా ఎంతో అవసరం. ఒడిశా-ఆంధ్ర మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేయాల్సి ఉంది.

గత వైసీపీ సర్కారు హయాంలో..

గత వైసీపీ సర్కారు హయాంలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు జిల్లా అడ్డాగా మారిందని చెప్పొచ్చు. ప్రధానంగా ఏవోబీ సరిహద్దు ప్రాంతాల్లో ఉన్న ఒడిశా గ్రామాల నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు అక్రమంగా గంజాయి దిగుమతి అయ్యేది. ఇక్కడి నుంచి వేర్వేరు ప్రాంతాలకు జోరుగా విక్రయాలు జరిగేవి. సరిహద్దులు దాటి జిల్లా కేంద్రంలోకి చొరబడిన ఓ ముఠా ఈ దందా కొనసాగించేవారనే ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలో ఒక వలంటీర్ గంజాయి విక్రయాల్లో అరెస్టు అయ్యారంటే పరిస్థితి ఎలా ఉండేదో అర్థం చేసుకోవచ్చు. చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ పోలీస్‌శాఖతో పాటు ఇతర శాఖల అధికారులు గంజాయిపై ప్రత్యేకంగా దృష్టి సారించినప్పటికీ.. ఆశించిన ఫలితాలు రాలేదని చెప్పొచ్చు. ఎన్ని కేసులు నమోదు చేసినా.. ఎంత మందిని అరెస్ట్ చేసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. గత ఐదేళ్లలో జిల్లాలో జోరుగానే గంజాయి దందా కొనసాగిందని చెప్పొచ్చు.

కేసుల నమోదు ఇలా...

2022లో ఎనిమిది కేసులు నమోదు చేసి 16 మందిని అరెస్టు చేశారు. సుమారు 292 కిలోల గంజాయిను స్వాధీనం చేసుకున్నారు. 2023లో 14 కేసులు నమోదు చేసి 27 మందిని అరెస్టు చేశారు. సుమారు 205 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2024లో ఇప్పటివరకు 14 కేసులు నమోదు చేసి 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. సుమారు 123 కిలోల గంజాయిను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

కఠిన చర్యలు తప్పవు..

గంజాయి విక్రయించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటాం. గతంలోనూ అనేక కేసులు నమోదు చేసి పలువురిని అరెస్ట్ చేశాం. గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం మోపుతాం.

-దిలీప్ కిరణ్, ఏఎస్పీ, పార్వతీపురం మన్యం



పాచిపెంట మండలం పి.కోనవలసలో చెక్‌పోస్టు ఇలా..

అందర్నీ కడుపుబ్బా నవ్వించే డార్లింగ్



నిర్మాతలుగా 'హను-మాన్' చిత్రంతో సూపర్‌హిట్ అందుకున్నారు కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య. లేటెస్ట్‌గా ప్రియదర్శి, నభానటేశ్ జంటగా రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'డార్లింగ్' చిత్రాన్ని నిర్మించారు. 'వై దిస్ కొలవెరి' అనేది ఉప శీర్షిక. అశ్వనీ రామ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం 19న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత చైతన్య మీడియాతో చిత్ర విశేషాలను పంచుకున్నారు.

'కపుల్స్ మధ్య జరిగే సంఘటనలని వినోదాత్మకంగా చూపించే ప్రయత్నమే ఈ సినిమా. యూత్, ఫ్యామిలీ ఇలా.ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా సినిమాను దర్శకుడు తీర్చిదిద్దారు. ఇందులో కథానాయకుడి పాత్ర చాలా అమాయకంగా.. కథానాయిక పాత్ర చలాకీగా ఉండాలి. ఈ పాత్రలకి ప్రియదర్శి, నభానటేశ్ సరిపోతారని అనిపించి వారిని తీసుకున్నాం. సినిమాలో ఇద్దరి క్యారెక్టర్లకీ సమ ప్రాధాన్యత ఉంటుంది. వినోదంతో పాటు భావోద్వేగాలని సమపాళ్లలో మిక్స్ చేసి తీసిన ఈ సినిమాలో.. హీరో హీరోయిన్ల మధ్యన వచ్చే సన్నివేశాలు అందరినీ కడుపుబ్బా నవ్విస్తాయి. వివేక్ సాగర్ సంగీతం సినిమాకు స్పెషల్ హైలైట్. 'హను-మాన్'కు సీక్వెల్‌గా వస్తున్న 'జై హనుమాన్' సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉంది. ఈ సినిమాలో హనుమంతుడి పాత్రలో ఎవరు నటిస్తారనేది మాత్రం సస్పెన్స్" అని చెప్పారు.

అనాథలే స్టార్స్

సంజయ్ శ్రీరాజ్‌ను హీరోగా, ప్రియా శ్రీనివాస్ హీరోయిన్‌గా నటించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. ఈ సినిమా గురించి దర్శకుడు ధర్మ మాట్లాడుతూ 'నెల్లూరులో చిత్రాన్ని నిర్మించాం. ఓ గల్లీలో నివసించే అనాథలు ఎదుర్కొనే సమస్యలను



చిత్రంలో వివరించాం' అని చెప్పారు. చిత్ర నిర్మాత డాక్టర్ అరవేటి యశోవర్ధన్ మాట్లాడుతూ 'క్రైమ్ డ్రామా చుట్టూ చిత్రకథ నడుస్తుంది. ఇందులో నాలుగు పాత్రలు ప్రముఖంగా ఉంటాయి. అనాథలైన వారి జీవితాలు ఎలా ఎవరి వల్ల మలుపు తిరిగిందో చూపించాం. మాస్ ఆడియన్స్‌కు నచ్చేసినిమా ఇది' అని చెప్పారు.

దర్శకధీరుడిపై డాక్యుమెంటరీ



దర్శకధీరుడు రాజమౌళిపై ఓ డాక్యుమెంటరీ తెరకెక్కుతోంది. రాఘవ్ ఖన్నా దర్శకత్వంలో 'ద మోడరన్ మాస్టర్స్' పేరుతో ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ ఈ డాక్యుమెంటరీని నిర్మిస్తోంది. ఆగస్టు 2న ఇది విడుదల కానుంది. దర్శకుడిగా రాజమౌళి ప్రయాణాన్ని.. ఆయన ఇండియన్ సినిమాపై చూపిన ప్రభావాన్ని ఇందులో చూపించనున్నారు. ఈ డాక్యుమెంటరీలో రాజమౌళి గురించి ఆయన బంధుమిత్రులు, దర్శకులు జేమ్స్ కామెరూన్, రుస్సో బ్రదర్స్, హీరోలు రానా, ప్రభాస్ తమ అభిప్రాయాలను తెలియజేయనున్నారు.

బడ్డీ హార్ట్ టచింగ్ సాంగ్



అల్లు శిరీష్ నటించిన తాజా చిత్రం 'బడ్డీ' ఈ నెల 26న విడుదల కానుంది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని జ్ఞానవేల్ రాజా, అధన నిర్మిస్తున్నారు. శామ్ ఆంటోన్ దర్శకుడు. ఈ సినిమా నుంచి 'చూసాలే నాలో నీ కలనే.. దాచాలే దాచాలే నాలో ఆ కలనే' అంటూ సాగే ఈ హార్ట్ టచింగ్ సాంగ్‌ను సాయి హేమంత్ రాశారు. సంగీత దర్శకుడు హిప్ హాప్ తమిళ స్వరపరిచి ఐరా ఉడిపితో కలసి పాడారు. గాయత్రి భరద్వాజ్, అజ్మల్, అమీర్, ప్రిషా రాజేశ్ సింగ్, ముఖేశ్‌కుమార్ తదితరులు నటించిన ఈ చిత్రానికి నేహా జ్ఞానవేల్ రాజా సహ నిర్మాత.

ఆధారాలు సమర్పించండి..



హీరో రాజ్‌తరుణ్‌పై ఫిర్యాదు చేసిన మహిళకు నోటీసులు

సినీ హీరో రాజ్‌తరుణ్ తనను మోసగించాడంటూ ఫిర్యాదు చేసిన లావణ్య అనే మహిళకు నార్సింగ్ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ఆమె ఫిర్యాదులో పేర్కొన్న అంశాలకు సంబంధించిన ఆధారాలను విచారణ నిమిత్తం తమకు సమర్పించాలని నోటీసులో పేర్కొన్నారు. లావణ్య ఆధారాలు సమర్పిస్తేనే ఈ కేసు దర్యాప్తులో పురోగతి ఉంటుంది. లేదంటే కోర్టు అనుమతితో పోలీసులు కేసును చట్ట ప్రకారం మూసివేస్తారు.

శేఖర్ కమ్ముల చేతుల మీదుగా...



సాయితేజ కల్వకోట, పావని కరణమ్ జంటగా నటిస్తున్న చిత్రం 'పైలం పిలగా'. తెలంగాణ నేపథ్యంలో సాగే ఈ హాస్యభరిత వ్యంగ్య చిత్రాన్ని యాడ్ ఫిల్మ్‌మేకర్ ఆనంద్ గుర్రం దర్శకత్వంలో రామకృష్ణ బొదుల నిర్మించారు.శుక్రవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'సోడు సోడు' పాటను డైరెక్టర్ శేఖర్ కమ్ముల లాంచ్ చేశారు. ఈ సందర్భంగా శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'ఈ పాటకు మంచి సాహిత్యంతో పాటు ఆకట్టుకునే సంగీతం తోడైంది' అని చెప్పారు. 'పూర్తి స్థాయి కంటెంట్ ఓరియెంటెడ్ చిత్రమిది" అని నిర్మాత రామకృష్ణ బొదుల తెలిపారు. ఈ పాటకు ఆనంద్ గుర్రం, అక్కల చంద్రమౌళి సాహిత్యం అందించగా, యశ్వంత్ నాగ్‌నారు సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: రవితేజ కుర్మన, డీఓపీ: సందీప్ బొద్దుల.

దిక్సూచి

తెలుగు రాష్ట్రాల్లో ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు ఉద్దేశించినకౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. టీజీఈఏపీ సెట్/ఏపీ ఈఏపీ సెట్‌లో మంచి ర్యాంక్ వస్తే ఇబ్బంది ఏమీ లేదు. కోరుకున్న కాలేజీలో, అనుకున్న బ్రాంచీలో సులువుగా సీటు పొందవచ్చు. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన అభ్యర్థులకే కొన్ని ఇబ్బందులు ఉంటాయి. ఎలా చేస్తే, మంచి కాలేజీలో, కోరుకున్న బ్రాంచీలో సీటు వస్తుందన్నది విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఎదురయ్యే ప్రశ్న. ఈ విషయంలో నిపుణుల మాటేమిటో చూద్దాం.

ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్ జాగ్రత్తలు



ఇంజనీరింగ్ వెబ్ ఆప్షన్ల ప్రక్రియ మొదలైనప్పుడు ఇరవై నుంచి ముప్పయ్ ఆప్షన్లు పెట్టుకుంటే చాలు అని ఎక్కువమంది విద్యార్థులు అనుకుంటారు. అయితే అది తప్పని కౌన్సెలింగ్ నిర్వాహకులు పదేపదే చెబుతున్నారు. నిజానికి వందల కొద్ది ఆప్షన్లు పెట్టుకునే అవకాశం ఉంది. అలాంటప్పుడు కేవలం కొన్ని ఆప్షన్లు మాత్రమే పెట్టుకుంటే, నష్టం జరిగే అవకాశమే ఎక్కువ. ముఖ్యంగా పెద్ద సంఖ్యలో ర్యాంకు వచ్చినప్పుడు విద్యార్థులు కనీసం రెండు, మూడు వందలు, వీలైతే అంతకన్నా ఎక్కువ ఆప్షన్లు పెట్టుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. తప్పకుండా వస్తాయన్న వాటికితోడు, అటూ ఇటూగా రావడానికి అవకాశం బాగా ఉన్న కాలేజీలు, బ్రాంచీలను కూడా ఎంచుకోవాలి. ప్రత్యేకించి మనకు రాదనుకున్న బ్రాంచ్ లేదా కాలేజీకి ఎవరూ ఆప్షన్ పెట్టుకోని పక్షంలో పరిస్థితి అనుకూలిస్తే మనకే దక్కవచ్చు.

అవకాశం ఒక్కసారే: ర్యాంక్ పెద్ద సంఖ్యలో వచ్చినప్పటికీ మంచి కాలేజీలు, కోర్సుల విషయంలో రాజీ పడాల్సిన పని లేదు. మనకు నచ్చిన కాలేజీ లేదంటే కోర్సు నుంచి ఆప్షన్లు ఆరంభించవచ్చు. ర్యాంకుల ఆధారంగా మాత్రమే సీట్ల కేటాయింపు ఉంటుంది. అంటే మొదటి ర్యాంక్ తరవాత రెండో ర్యాంక్ క్యాండిడేట్ ఇచ్చుకున్న ఆప్షన్ల ఆధారంగా అలాట్‌మెంట్ ఉంటుంది. ఉదాహరణకు వందో ర్యాంక్ వచ్చిన అభ్యర్థి ప్రత్యేకించి నచ్చిన కాలేజీలను తనిష్టం వచ్చిన రీతిలో పెట్టుకున్నాడని అనుకుందాం. ఆ అభ్యర్థికి ఆర్డర్ ఆఫ్ మెరిట్ ప్రకారం సీటు కేటాయింపు జరుగుతుంది. అంటే ఆ వ్యక్తిని వందో అభ్యర్థిగా పరిగణిస్తుంది. తనకు ముందున్న 99 మందికి సీట్ల కేటాయింపు పూర్తయ్యాక ఇతని వంతు వస్తుంది. అప్పుడు సీటు కేటాయింపు ఆ వ్యక్తి పెట్టుకున్న మొదటి ఆప్షన్ నుంచి ఆరంభమవుతుంది. ఆప్షన్ నెంబర్ 1, 2, 3.. అలా మొదలవుతుంది. ఆప్షన్ 30 దగ్గర క్లిక్ కావచ్చు. లేదంటే 200 వద్ద క్లిక్ కావచ్చు. ఆ ఆప్షన్‌గా పెట్టుకున్న కాలేజీ, కోర్సులో సీటు లభిస్తుంది. వందో వ్యక్తిగా మాత్రమే ఆ అభ్యర్థికి కేటాయింపు ఆరంభమవుతుంది. ముఖ్యంగా ఈ వెబ్ కౌన్సెలింగ్‌లో గరిష్ఠంగా ఆప్షన్లకు అవకాశం ఇవ్వడం అందుకోసమేనని గుర్తించాలి. అసలు ఒక్కరూ ఆప్షన్ పెట్టుకోనందున కొన్ని సీట్లు మిగిలిపోయాయని చెబుతూ ఉంటారు. అలాగే ఒక్కరు కూడా చేరని కాలేజీలు లేదా బ్రాంచీల వివరాలను కౌన్సెలింగ్ నిర్వాహకులు అధికారికంగానే ప్రకటిస్తుంటారు. ఆ కాలేజీలు లేదా ఆ గ్రూపులు కొన్ని అంత డిమాండ్ లేనివి కావచ్చు. అలాగే డిమాండ్ ఉన్నప్పటికి రాదని కొందరు ఆప్షన్లుగా ఇచ్చుకుని ఉండకపోవచ్చు. కారణం ఏమైనా ఆ సీట్లు మొదటి రౌండ్‌లో మిగిలిపోయాయన్నది వాస్తవం.

మొదటి అవకాశమే మంచిది: ఇలాంటి వెబ్ కౌన్సెలింగ్‌లో తొలి ఎంపికే కీలకం. రెండోసారి కౌన్సెలింగ్‌కు అవకాశం ఇచ్చినప్పటికీ, అప్పుడు ఛాన్స్‌లు తక్కువ. కేవలం మిగిలిన సీట్లకు మాత్రమే పోటీపడాల్సి వస్తుంది. అందువల్ల మొదటి కౌన్సెలింగ్ సమయంలోనే కొద్దిగా తెలివిగా వ్యవహరించాలి.

లాస్ట్ ఇయర్ కటాఫ్ చూడాలి: కాలేజీలు, సీట్లవారీగా గత ఏడాది కేటాయింపు సమాచారం చూస్తే మంచిది. అయితే ఇది కేవలం గైడింగ్ ఫ్యాక్టర్ మాత్రమే. ఈ ఏడాది కూడా అదే మాదిరిగా కేటాయింపు జరగాలని లేదు. ప్రత్యేకించి ప్రసిద్ధ కాలేజీల్లో మాత్రం ర్యాంకింగ్‌లో కొద్దిగా అటూ ఇటూగా మాత్రమే మారుతుంది.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
రాయపూర్ ఎన్ఐటి డైరెక్టర్

ఆంధ్రప్రదేశ్
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 7 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 10 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 12
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 13
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 16
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 17 - 22
- **తరగతులు ప్రారంభం:** జూలై 19 నుంచి
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/

తెలంగాణ
ఫస్ట్ ఫేజ్ కౌన్సెలింగ్ షెడ్యూల్

- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, స్లాట్ బుకింగ్:** జూలై 12 వరకు
- **సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 6 నుంచి 13 వరకు
- **వెబ్ ఆప్షన్స్:** జూలై 8 నుంచి 15 వరకు
- **ఆప్షన్ల ఫ్రీజింగ్:** జూలై 15
- **సీట్ల అలాట్‌మెంట్:** జూలై 19
- **సెల్ఫ్ రిపోర్టింగ్:** జూలై 19 - 23
- **వెబ్‌సైట్:** tgeapcet.nic.in

జయశంకర్ వర్సిటీలో పాలిసెట్ ప్రవేశాలు

హైదరాబాద్-రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్ఏయూ)- వ్యవసాయ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. తెలంగాణ పాలిసెట్ 2024 (అగ్రికల్చర్ స్ట్రీమ్) ర్యాంక్ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో 260 సీట్లు, అనుబంధ ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల్లో 540 సీట్లు ఉన్నాయి. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. గ్రామీణ పాఠశాలల్లో కనీసం నాలుగేళ్లు చదివిన విద్యార్థులకు ప్రతి ప్రోగ్రామ్‌లో 60 శాతం సీట్లు కేటాయించారు. ఇప్పటికే ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించిన తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు షెడ్యూల్ ప్రకారం కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి.

కౌన్సెలింగ్ షెడ్యూల్: తెలంగాణ పాలిసెట్ 2024(అగ్రికల్చర్ స్ట్రీమ్)లో 447 నుంచి 19998 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 10న, 20015 నుంచి 46924 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 11న, 47062 నుంచి 68151 మధ్య ర్యాంక్‌లు సాధించినవారు జూలై 12న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలి. కౌన్సెలింగ్ ప్రక్రియ ఉదయం తొమ్మిదిన్నరకు ప్రారంభమౌతుంది.

- **కౌన్సెలింగ్ వేదిక:** యూనివర్సిటీ ఆడిటోరియం, పీజేటీఎస్ఏయూ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్
- **ఎంపికైన అభ్యర్థులు చెల్లించాల్సిన ఫస్ట్ సెమిస్టర్ ఫీజు:** యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలల్లో రూ.19,460; ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో రూ.22,210.
- **వెబ్‌సైట్:** www.pjtsau.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/r1mnRyKలో చదవండి.

ఉపాధి కల్పనలో వైసీపీ విఫలం

- నిరుద్యోగ యువతకు శిక్షణ కోసం ప్రత్యేక ప్రణాళిక
- ఎంఎస్ఎంఈ, సెర్ప్, ఎన్నారై వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం (ఆంధ్రజ్యోతి): ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభు త్వం విఫలమయ్యిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. గత పాలకులు నిర్లక్ష్యం వల్ల అనేక మంది చదువుకున్న యువత వలసబాట పట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగ యువతకు శిక్షణనందించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. శనివారం విజయనగరంలోని మహిళా ప్రాంగణంలోని టీటీడీసీ స్కిల్ కాలేజ్‌లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా సీడాప్ ద్వారా శిక్షణ కార్యక్రమాలను డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి మంత్రికి వివరించారు. కాగా ఎస్‌బీఐ ఆర్‌సెట్టి కేంద్రంలో జరుగుతున్న శిక్షణ, ఉద్యోగావకాశాల గురించి ఆ సంస్థ డైరెక్టర్ జీబీవీ రమణ వివరించారు. బోకే మొక్కల విక్రయాల కేంద్రాన్ని మంత్రి, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు సందర్శించారు. ప్రాంగణంలోని పలు ఉపాధి, శిక్షణా సంస్థలు, తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ గత పాలకులు నైపుణ్య శిక్షణను పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. ఇంజినీరింగ్ కళా శాలల్లో సైతం నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు కొరవడ్డా యన్నారు. విజయనగరం జిల్లాలో ఫార్మా, విశాఖ జిల్లాలో హోటల్ పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో వాటికి అనుగుణంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కేంద్రాన్ని విస్తరించి, ఎక్కువ మందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తామని చెప్పారు. మహిళల ఆర్థికాభివృద్ధిని వైసీపీ పాలకులు విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో ఏపీడీ సావిత్రి, ఉద్యానవన శాఖ ఏడీ జమదగ్ని, జిల్లా ఉపాధి అధికారి అరుణ, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గోవిందరావు, జేడీఎం మార్టిన్, డీఆర్‌డీఏ, వెలుగు అధికారులు పాల్గొన్నారు.

డీసీసీబీ అభివృద్ధికి సహకారం..

విజయనగరం రూరల్: డీసీసీబీ అభివృద్ధికి సహకరిస్తానని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హామీఇచ్చారు. విజయనగరంలో అంతర్జాతీయ సహకార దినోత్సవం పురస్కరించుకుని నాబార్డు సహకారంతో డీసీసీబీ ఏర్పాటుచేసిన రెండు సంచార వాహనాలను ప్రారంభించారు. సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ బ్యాంకు డిపాజిట్లు పెంచాలన్నారు.కార్యక్రమంలో ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీ గజపతిరాజు, డీసీసీబీ ఇన్‌చార్జి సీఈవో సీహెచ్ ఉమామహేశ్వరరావు, జనరల్ మేనేజర్ సత్యనారాయణ, జేసీ కార్తీక్, నాబార్డు డీడీఎం నాగార్జున, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీకొని వృద్ధురాలి మృతి

గజపతినగరం: మదుపాడ గ్రామం వద్ద గల జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో వృద్ధురాలు మృతిచెందింది. గ్రామానికి చెందిన పేలూరు చిట్టమ్మ (68) బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా మరుపల్లి నుంచి గజపతినగరం వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన చిట్టమ్మను విజయనగరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం తెల్ల వారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలి కుమార్తె నక్క జయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేస దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

చీపురుపల్లి: పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ శనివారం మృతిచెందింది. ఈ ఘటనపై చీపురుపల్లి ఎస్ఐ కె.కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీపురుపల్లి మండలంలోని పేరిపి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని బొమ్మిరోతు పార్వతి అనే మహిళ ఈనెల 1న పురుగు మందు తాగింది. కుటుంబీకులు గమనించి, చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పరశురాంపురంలో వృద్ధుడు..

రాజాం రూరల్: మండలంలోని పరశురాంపురం గ్రామానికి చెందిన బెవర అప్పలరాము (73) చికిత్సపొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ అల్లు లక్ష్మునాయుడు తెలిపారు. ఏఎస్ఐ కథనం మేరకు.. మానసిక పరిస్థితి బాగులేకపోవడంతో ఈనెలరెండోతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాము పురుగుల మందు తాగాడు. రాత్రి పదిగంటల సమయంలో ఇంటికి చేరడంతో పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు రాజాంలోని సామాజిక ఆసుపత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శనివారం ఉదయం మృతిచెందాడు. అప్పలరాము భార్య అన్నపూర్ణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేశారు.

పోలీసులను ఆశ్రయించిన నవ దంపతులు

- యువకుడిపై యువతి బంధువుల దాడియత్నం, బెదిరింపులు

రాజాం రూరల్: రాజాంలో నవ దంపతులు పోలీసులను ఆశ్రయించారు. ఇటీవల వివాహం చేసుకున్న ఆ జంట తమకు రక్షణ కల్పించాలని కోరుతోంది. కొంత కాలంగా ప్రేమించుకుంటున్న వారిద్దరూ ఇటీవల వివాహం చేసుకున్నారు. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని జగన్నాథకాలనీకి చెందిన వ్యాపారం చేస్తున్న కొత్తకోట వెంకటేశ్, ఈశ్వర నారాయణ కాలనీకి చెందిన మెడిసిన్ విద్యార్థిని వారణాశి లక్ష్మిసోమిదేవి మధ్య స్నేహం ప్రేమగా మారింది. దగ్గర బంధువులు కావడంతో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈవిషయం తెలుసుకున్న లక్ష్మి సోమిదేవి తండ్రి గురునాథ్ పెళ్లికి నిరాకరించగా, వెంకటేష్ తండ్రి నాగేశ్వరరావు నుంచి అభ్యంతరం రాలేదు. స్నేహితుల సహకారంతో గతనెల ఐదోతేదీన అన్నవరం సత్యనారాయణస్వామి సన్నిధానంలో వివాహం చేసుకున్నారు. జూన్ 12న రాజాంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్టర్ మేరేజ్ కూడా చేసుకున్నారు. ఈనేపథ్యంలో లక్ష్మి సోమిదేవి తండ్రితోపాటు బంధువులు కొద్దిరోజులుగా వెంకటేశ్‌ను ఫోన్లో బెదిరిస్తున్నారు. దీంతో పోలీస్‌స్టేషన్‌కు వెళ్లేందుకు బయలుదేరిన వెంకటేష్‌పై ఈనెల ఐదో తేదీన రాజాంలో బొబ్బిలి నుంచి రెండు కార్లలో వచ్చిన లక్ష్మిసోమిదేవి బంధువులు దాడికి ప్రయత్నించారు. ఇది గమనించిన వెంకటేశ్ తన స్నేహితుల సహకారంతో బయటపడ్డాడు. ఈవిషయాన్ని రాజాం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడులు చేసేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయని వెంకటేశ్, లక్ష్మి సోమిదేవి దంపతులు వాపోతున్నారు. న్యాయం చేయాలని పోలీసులను ఆశ్రయించామని, అయినా మాకు భయంగానే ఉందని, మమ్మల్ని విడదీయాలని ప్రయత్నిస్తే ఆత్మహత్యే శరణ్యమని చెప్పారు. కాగా పరస్పర అంగీకారం, ఇష్టంతో ఒక్కటైన జంటకు న్యాయం చేస్తామని రాజాం టౌన్ సీఐ మోహనరావు తెలిపారు. ఇద్దరూ మేజర్లే కావడంతో వారి వివాహం చట్టపరంగా చెల్లుబాటు అవుతుందని చెప్పారు. వెంకటేశ్, లక్ష్మి సోమిదేవి జోలికి పోవద్దని ఇరు కుటుంబాల పెద్దలను హెచ్చరించినట్లు తెలిపారు. వారిపై బైండోవర్‌చేశామని, వారికి ఇబ్బందులు కలిగించే వారిపై చర్యలు తప్పవని చెప్పారు.


చోరీ కేసులో నిందితుల అరెస్టు

గజపతినగరం: ట్రాక్టరుతో పాటు దమ్ము సెట్లు చోరీకి పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాస రావు తెలిపారు.శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గజపతినగరం మండలంలోని రామన్న పేటగ్రామానికి చెందిన మనిపూరి గోవింద, జిన్నాం గ్రామానికి చెందిన ఇజ్జిరోతు సత్యనారాయణ తమ దమ్ము సెట్లు చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ నేపథ్యంలో బొలెరో వాహనంలో విజయనగరంలో వాటిని నిందితులు అమ్మకానికి తీసుకువెళుతుండగా గజపతినగరంపైడితల్లి అమ్మవారి గుడి వద్ద దాడులు చేశామని చెప్పారు. గుర్ల మండలం లవిడాంగ్రామానికి చెందిన మీసాల గోవింద, మెరకముడిదాం మండలం భైరిపురం గ్రామానికి చెందిన కొండ్రు గౌరునాయుడుతో పాటు వారికి సహకరించిన లవిడాం గ్రామానికి చెందిన గొర్లె నరేంద్ర, కొంకి పైడిరాజులను అరెస్టు చేశామన్నారు. గరివిడి, గుర్ల, బుదరాయివలస పోలీసు స్టేషన్ల పరిధిలోనూ వీరు చేసిన నేరాలు అంగీకరించారని తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ రూ.5.05 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. ట్రాక్టర్, బొలెరో వాహనాలను సీజ్ చేసినట్టు చెప్పారు. ఈ సమావేశంలో సీఐ ఎస్.వి.ప్రభాకరావు, ఎస్ఐ యు.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసుల నమోదు

రాజాం రూరల్: మండలంలోని నర్సింహపురం గ్రామానికి చెందిన బూరాడ నరసింగరావు, ఆయన చిన్నాన్న ఆదినారాయణ మధ్య నెలకొన్న భూవివాదంతోపాటు భూమిలో ఉన్న పంట విషయంలో తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. దీంతో ఇరువర్గాలు రాజాం పోలీస్ స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ మేరకు సీఐ మోహనరావు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొట్లాటలో గాయపడిన వారంతా రాజాం సామాజిక ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ హత్యపై నిరసన


నిరసన తెలుపుతున్న దళిత నాయకులు

కొత్తవలస: తమిళనాడు బీఎస్పీ అధ్యక్షుడు ఆర్మ్‌స్ట్రాంగ్‌ను తన ఇంటి సమీపంలోనే హత్యచేయడంపై దళితసంఘాలతో పాటు విశాఖ జిల్లా అధ్యక్షుడు బోని కృష్ణ నిరసన తెలిపారు. శనివారం కొత్తవలస జంక్షన్‌లో ఆర్మ్‌స్ట్రాంగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బోనికృష్ణ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు అప్పలసూరి, అప్పారావు పాల్గొన్నారు.

కబేళాకు తరలిస్తున్న 43 పశువుల స్వాధీనం

విజయనగరం క్రైం: విజయనగరంకంటోన్మెంట్ ప్రాంతంలో పశువులను కబేళాకు తరలిస్తున్నట్లుగా ఎస్‌బీ పోలీసులకు సమాచారం రావడంతో ఎస్పీ దీపికా ఆదేశాలతో శనివారం వన్‌టౌన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు వాహనాల్లో 43 పశువులను కబేళాకు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్న ట్లు సీఐ వెంకటరావు తెలిపారు.డ్రైవర్లు మిరియాల సురేష్, పత్రి శంకరరావుతో పాటు పశువులను అక్రమంగా తరలిస్తున్న అబ్దుల్ బషీని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో సీఐ వెంకటరావు, అశోక్‌కుమార్, ఎస్ఐ నరేష్, ఎస్ఐ సాగర్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలి

విజయనగరం దాసన్నపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మూఢ నమ్మకాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని భారత నాస్తిక సమాజం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బంకురు జోగినాయుడు డిమాండ్ చేశారు. శనివారం విజయనగరంలోని కోట జంక్షన్‌సమీపంలోనికార్యాలయంలో మాట్లాడుతూ బాబాలమోసాలు, నేరాలు, ఎక్కువగా జరుగుతుండడంతో వాటిని అరికట్టాలని కోరారు. బోలేబాబా సత్సంగ్ కార్యక్రమంలో మరణించిన వారిని రూ.20 లక్షలు చెల్లించాలని డిమాండ్‌చేశారు.

దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలకపాత్ర

- శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


జామి: కుమరాంలో బాలికలకు స్టూడెంట్స్ కిట్లు అందజేస్తున్న లలితకుమారి

జామి: దేశాభివృద్ధిలో విద్యార్థులదే కీలక పాత్ర అని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నతస్థానాలకు ఎదగాలని ఆకాం క్షించారు. శుక్రవారం మండలంలోని కుమరాం కస్తూర్బా బాలికల పాఠశాలలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు జయశ్రీ, గంగరాజు, తహసీల్దార్ రాంబాయ్, ఎంపీడీవో తిరుమలరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు బండారు పెదబాబు, టీడీపీ విశాఖ పార్లమెంట్ మహిళ ప్రతినిధి మాకిరెడ్డి శ్రీలక్ష్మి, పార్టీ మండలాధ్యక్షుడు పోలిపర్తి స్వామినా యుడు, పార్టీ మండలకార్యదర్శి వర్రి రమణ, రాయవరపు ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

- జామి మండలంలోని జట్టేడివలస సచివాలయాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పరిశీలించి, ఉద్యోగులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఉద్యోగులు చంద్రబాబు చిత్రపటం బహూకరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కుమారి, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాయవరపు శంకర్, వెంకట సత్యం,సంతోష్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీకి పూర్వవైభవం తీసుకువస్తా

- బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: బాడంగి సీహెచ్‌పీకి పూర్వవైభవం తీసుకొస్తామని బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. శనివారం బాడంగి సీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి అభివృద్ధి చేస్తానన్నారు. గత ప్రభుత్వం ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించకుండా నిర్వీర్యంచేసిందని ఆరోపించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మం నాయుడు,తెంటు రవిబాబు, వైద్యులు పెద్దింటి నాగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.


సీహెచ్‌సీలో పరిశీలిస్తున్న బేబీనాయన

రేపటి నుంచి ఇసుక ఉచితం

- మూడు స్టాక్ పాయింట్ల నుంచి అందించే ఏర్పాట్లు
- జిల్లాలో సిద్ధంగా 92 వేల టన్నుల ఇసుక
- జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ అంబేద్కర్


మాట్లాడుతున్న కలెక్టర్ అంబేద్కర్

విజయనగరం-ఆంధ్రజ్యోతి/కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వినియోగదారులకు సోమవారం నుంచి ఉచితంగా ఇసుక సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమా వేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇసుకరీచ్‌లు లేకపోవడంతో శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుంచి ఇసుక తీసుకు వచ్చి, కొత్తవలస, డెంకాడ, బొబ్బిలి గ్రోత్ సెంటర్ ప్రాంతాల్లోఉన్న యార్డుల్లో నిల్వలు ఉంచినట్లు తెలిపారు. ఆయా స్టాక్ పాయింట్ల నుంచి జిల్లాలో ఇసుక కావలసిన వారికి ఏర్పాట్లు చేశామన్నారు. మూడు స్టాక్‌పాయింట్ల వద్ద 92 వేలటన్నుల ఇసుక సిద్ధంగా ఉందన్నారు.రోజుకు ఒకో వ్యక్తికి 20టన్నులు మించకుండా సరఫరాచేస్తామని, టన్నుకు రూ.605 చొప్పున ఇసుక హేండ్లింగ్ చార్జీలువసూలు చేస్తామని తెలిపారు.ఇసుక సరఫరా ఫిర్యాదులకు కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నెంబరు, రెవెన్యూ, పోలీస్,గనుల శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటుచేసినట్లు చెప్పారు.రవాణాశాఖ నిర్ణయించిన ధరల మేరకు మాత్రమే ఇసుక రవాణా చార్జీలను వసూలు చేయాలని, అధికంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించా రు. వినియోగదారులు ఇసుక హేండ్లింగ్ చార్జీలు చెల్లించి వారు ఇసుకను తీసుకు వెళ్లేందుకు వీలుగా ట్రాన్సిట్ రసీదు ఇస్తా రని తెలిపారు. గ్రామాల్లోఉన్న గెడ్డలు, వాగుల్లో లభ్యమయ్యే ఇసుకను స్థానిక అవసరాల కోసం వినియోగించుకోవచ్చని చెప్పారు. అయితే ఏ గ్రామంలో ఉన్న గెడ్డ, వాగుల నుంచి ఆ గ్రామస్థులు మాత్రమే ఎడ్ల బండ్ల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమ తిస్తారన్నారు. ఇసుక సరఫరా ఫిర్యాదులు, సలహాల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా టోల్‌ఫ్రీ నెంబర్ 9032338135 నెంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు లేదా సలహాలు అందించవచ్చని చెప్పా రు. ఉచిత ఇసుక సరఫరాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు అన్ని మండల, డివిజన్, గ్రామ వార్డు సచి వాలయాల్లో ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేయాలని గనుల శాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ కార్తీక్, సెబ్ ఏఎస్పీ అస్మాపరహీన్, డీఆర్‌వో అనిత, ఆర్డీవోలు సూర్యకళ, సాయిశ్రీ, బి.శాంతి, డీడీ సూర్యచందరరావు, డీడీ దుర్గా ప్రసాద్, రవాణా శాఖ ఉప కమీషనర్ మణకుమార్, కాలుష్య నియంత్రణామండలి ఈఈ సరిత, జలవనరుల శాఖ ఈఈ సీతారామ నాయుడు, డీపీఓ శ్రీదర్‌రాజా పాల్గొన్నారు.

శిష్టకరణాలను ఓబీసీలో చేర్చాలి


మంత్రి శ్రీనివాస్‌ని సత్కరిస్తున్న శిష్టకరణ సంఘ ప్రతినిధులు

విజయనగరం దాసన్నపేట: జిల్లాలోని శిష్టకరణాలను ఓబీసీలోచేర్చే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషిచేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు ఎంపీ గౌరీశ్వరరావు కోరారు. ఈమేరకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని శనివారం గౌరీశ్వరరావు ఆధ్వర్యంలో సంఘ సభ్యులు కలిశారు. ఈసందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో శిష్టకరణాల సంక్షేమమే లక్ష్యంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ కలిసి సమస్యలను వివరించామన్నారు. కార్యక్రమంలోసంఘ ప్రతినిధులు వెంకటేష్, పరమేశ్వరరావు, జోగారావు, బలివాడ వెంకట రమణారావు, తిరుపతిరావు, త్యాడప్రసాద్‌పట్నాయక్, శ్రీనివాస్, బాలు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలకు స్పెషల్‌డ్రైవ్: డీఈవో


మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

బొబ్బిలి: బడిబయటఉన్నవారిని బడిలో చేర్పుకునేందుకు వచ్చే నెల వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. శనివారం బొబ్బిలిలోని పలు హైస్కూళ్లను డీఈవో ప్రేమ్‌కుమార్ సందర్శించారు.తొలుత ఓ పాఠశాలపై వచ్చిన ఆరోపణలపై విద్యార్థి సంఘం నాయకులతో కలిపి విచారణ జరిపారు. అనంతరం ప్రభుత్వ బాలికలఉన్నతపాఠశాల, గొల్లపల్లి శ్రీవేణుగోపాల మున్సిపల్ హైస్కూళ్లను ఆయన సందర్శించారు.బాలికల హైస్కూల్‌లో ఉపాధ్యాయుల మధ్య విభేదాలు ఉన్నట్లు ఫిర్యాదులు నేపథ్యంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీబీఎస్ఈ సిలబస్ అమలవుతున్న 63 పాఠశాలల్లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చామన్నారు.ఎంఈవోలు, సీనియర్ హెచ్ఎంలతో ప్రతి మండలంలో కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యాపరమైన అన్ని మస్యల పరిష్కారానికి ఈ కమిటీ కృషి చేస్తుందన్నారు. జిల్లాకు ఇంకా యూనిఫామ్‌దుస్తులు రాలేదన్నారు.పిరిడి జిల్లాపరిషత్ హైస్కూలులో మధ్యాహ్నభోజనం పథకం అమలులో లోపాలపై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంఈవోలు చల్లా లక్ష్మణరావు, గొట్టాపు వాసు, హెచ్ఎంలు ఉన్నారు.

అధికారులను నిలదీసిన సర్పంచ్‌లు

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బోగి గౌరి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలు సమస్యలపై అధికారులను సర్పంచ్‌లు నిలదీశారు. మల్లంపేట, పూడివలస సర్పంచ్‌లు వంగపండు పద్మ, రెడ్డి తిరుపతినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పేరుకుపోయాయని, పలుసార్లు పంచాయతీ అధికారి సూర్యనారాయణకు విన్నవించిన పట్టించుకోలేదని, గ్రీన్‌అంబాసీడర్ల జీతాలు రెండేళ్ల నుంచి రాలేదనిచెప్పినా ఇంకా వైసీపీ మోజులో ఉండి, కాలయాపన చేస్తున్నారన్నారు. వాడాడ ఎంపీటీసీ రెడ్డి సునీతవిద్యుత్‌శాఖ అధికారుల తీరుపై మం డిపడ్డారు. పలుగ్రామాల్లో విద్యుత్‌వైర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, ఇళ్లపై, పంటపొలాల్లో ఎక్కడిక్కడే పడి ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ తాగు,సాగునీరు సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రామారావు, వైస్ ఎంపీపీలు భాస్కరరావు, రమేష్ పాల్గొన్నారు.


ఈవోపీఆర్డీని నిలదీస్తున్న సర్పంచ్ పద్మ

మెరుగైన వైద్యం అందించాలి: అదితి

విజయనగరం రింగురోడ్డు: తల్లీపిల్లలకు మెరుగైన వైద్యం అందించాలని విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజు కోరారు. శనివారం విజయనగరంలోని మహారాణి ఘోషాసుపత్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో సౌకర్యాలపై వైద్యులతో మాట్లాడారు. అనంతరం ప్రతి వార్డుని తిరిగి సౌకర్యాలపై ఆరాతీశారు కార్యక్రమంలో సూపరింటెండెంట్ అప్పలనాయుడు, హెచ్‌వోడీ అరుణాశుభశ్రీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలి

రాజాం: ఎస్సీ కాలనీల్లో ప్రధాన సమస్యలు పరిష్కరించాలని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం కోరారు.ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను శనివారం కలిశారు. కాగా జిల్లాపై తనకు అవగాహన ఉందని, మండల స్థాయి అధికారులు,స్థానిక నాయకులు సహకారంతో ముందుకువెళ్తానని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో చీపురుపల్లి ఎస్సీ సెల్ నాయకులు రేగాన రామారావు, రేగాన అప్పలనాయుడు, తేగల శంకరరావు, వర్రి రమేష్ దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

'జనసేన దృష్టికి సమస్యలు తీసుకురావాలి'

రాజాం: గ్రామస్థాయిలో సమస్యలు పార్టీ దృష్టికి తీసుకురావాలని జనసేన జిల్లా ప్రధానకార్యదర్శి యాపీ రాజు కోరారు. శనివారం రాజాం జనసేన కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు గార శివరాం అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ విజయానికి కృషిచేసిన జనసేన నాయకులను అభినందించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కార్యదర్శి సైడాల జగదీశ్వరరావు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

'కాగార్'కు వ్యతిరేకంగా సన్నద్ధం కావాలి

- విరసం అధ్యక్షుడు పాణి


మాట్లాడుతున్న పాణి

బొబ్బిలి: గ్రీన్‌హంట్, సమాధానం వంటి ఆపరేషన్ల తరువాత తాజాగా ఆపరేషన్ కాగార్ తీసుకొచ్చారని, ఈ యుద్ధానికి వ్యతిరేకగా సన్నద్ధం కావాలని విరసం అధ్యక్షుడు పాణి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో గంటి ప్రసాదం 11 వర్ధంతి సభను పీకేఎస్ నాయకుడు తమటాల అప్పలనాయుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాణి మాట్లాడుతూ విప్లవోద్యమం ఆవిర్భావం నుంచి నేటి వరకు వేలాదిమందిని పాలకులు హతమార్చారన్నారు. అన్ని రాజకీయ పార్టీల అజెండా ఒక్కటేనని మావోయిస్టులను తుదముట్టించడమేనని తెలిపారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి బి.కొండారెడ్డి మాట్లాడుతూ ఆదివాసీలు, మూలవాసుల మనుగడకు దెబ్బతీసే విధంగా అటవీసంపదను బహుళజాతి సంస్థలకు కట్టబెట్టేందుకు పాలకులు విచక్షణారహితంగా ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. సభలో ఇఫ్టూ, సీఐటీయూ నాయకులు పిల్లా లక్ష్మణరావు, పి.శంకరరావు, పీకేఎస్ నాయకులురాయితీ సత్యం, దాసరి వెంకటరమణ, నల్లి తవిటినాయుడు, కుమార్‌నాయుడు, సుధీర్, ప్రజాకళామండలి నాయకులు తూముల సింహాచలం, బొడ్డేపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

కలిశెట్టికి స్వాగతం పలికిన టీడీపీ నాయకులు

బొబ్బిలి: ఎంపీగా ప్రమాణ స్వీకరంచేసిన తర్వాత తొలిసారిగా జిల్లాకు వచ్చిన కలిశెట్టి అప్పలనాయుడుకు శనివారం విజయనగరంలో బొబ్బిలి టీడీపీ నాయకులు, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ గెంబలి శ్రీనివాసరావు ఎమ్మెల్యే బేబీనాయన తరఫున ఘనస్వాగతం పలికారు. స్వాగతం పలికారు. కౌన్సిలర్ బొత్స సురేష్, 13 వ వార్డు ఇన్‌చార్జి బొట్టశివ, పార్టీ మండలాధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, గుల్ల హరికృష్ణ, నారాయణరావు తదితరులు ఎంపీకి వీరంతా బొబ్బిలి వీణను బహూకరించారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

కొత్తవలస: ప్రభుత్వ భూములను ఆక్రమించి అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. రెల్లి రెవెన్యూ సర్వేనెంబరు 26-5 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాన్ని తమ సిబ్బంది తొలగించినట్లు చెప్పారు.కొత్తవలస రెవెన్యూలో గల 168 సర్వేనెంబరులో అక్రమంగా నిర్మిస్తున్నట్లు సమాచారం రావడంతో పరిశీలించి తొలగించినట్లు తెలిపారు.

అధిక దిగుబడికి కృషి చేయాలి

రేగిడి: చెరకు అధిక దిగుబడికి కృషిచేయాలని, కంపెనీ ఇచ్చే ప్రోత్సాహకాలను రైతులు వినియోగించుకోవాలని ఈఐడీ ప్యారీ ముఖ్య నిర్వహణ అధికారి హసిఫ్ జేఏ హచ్ సూచించారు. శనివారం ప్యారీ కర్మాగారం పరిధిలోని రాజాం, పొందూరు మండలాల్లోని పలు గ్రామాల్లో చెరకు పంట క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో కేన్ విభాగాధిపతి జె.రాజేంద్రన్, యూనిట్ హెడ్ పట్టాభిరామిరెడ్డి పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధించాలి

రాజాం: వ్యాపారులు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పురపాలకసంఘం కమిషనర్ జె.రామప్పల నాయుడు కోరారు. శనివారం పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో షాపులు యజమానులు, వ్యాపారులు, పండ్లు బళ్ల, చికెన్, మటన్, కురగాయలు షాపులు నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వికాస తరంగిణి కన్వీనర్ టీటీవీ రమణమూర్తి, ఏఈ భాగ్యలక్ష్మి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేగొండి ప్రసాద్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట కొట్టానవీధి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తనిఖీ చేశారు.స్థానిక పోతిరాజు పట్టి వార్షికోత్సవం పురస్కరించుకుని నిర్వహించిన జాతరలోపాల్గొన్నారు. ఆమె వెంట నాయకులు రమణాజీ, కొండం మల్లేశ్వరరావు ఉన్నారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

రాజాం రూరల్: రాజాం జీఎంఆర్‌ఐటీలో రెండు రోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ సదస్సు శనివారంతో ముగిసింది. అమెరికాలోని యూనివర్శిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన ప్రొఫెసర్ మిలింద్‌ఖిరే, ఎస్ఆర్ యూనివర్శిటీ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ తమ సందేశాలను ఆన్‌లైన్ ద్వారా విద్యార్థులకు తెలియజేశారు. వ్యర్థాల నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లను మిలింద్ ఖిరే వివరించారు. రెండు రోజుల సదస్సులో 136పరిశోధన పత్రాలను పరిశోధకులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, జె.గిరిష్, పలుశాఖాధిపతులు పాల్గొన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి

రాజాం రూరల్: ద్విచక్ర వాహనచోదకు లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవా ధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ న్యాయాధికారి వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తెలిపారు. రాజాం కోర్టు ప్రాంగణంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జూనియర్ న్యాయాధికారి కృష్ణ సాయితేజ, రాజాం రూరల్ సీఐ. ఎస్.శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

స్పీడ్‌బ్రేకర్లతో ప్రమాదాలు


నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటుచేసిన స్పీడ్‌బ్రేకర్

వంగర: రాజాం-వంగర రహదారిలో మడ్డువలస రెండో మైలు రాయివద్ద కొందరు యువకులు నిబంధనలకు విరుద్ధంగా స్పీడ్‌బ్రేకర్లు నిర్మించడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వారంరోజుల కిందట సరసనాపల్లికి చెందిన యువకులు రహదారిపై స్పీడ్‌బ్రేకర్లు నిర్మించారు.ఆ ప్రదేశంలోప్రమాదకమైన మలుపు ఉండడంతో తరచూ వాహనచోదకులు ఇబ్బందులకు గుర వుతున్నారు.కాగాఅక్కడ స్పీడ్‌బ్రేకర్ ఏర్పాటు చేయడం నిబంధనలకు విరుద్ధమని ఆర్‌అండ్‌బీ ఏఈ కేవీ స్వామి తెలిపారు. ఇప్పటికే ఎమ్మెల్యే మురళీమోహన్ పోలీస్, ఆర్‌అండ్‌బీ అధికారులకు తొలగించాలని ఆదే శించారని చెప్పారు. తొలగించడానికి చర్యలు తీసుకుం టున్నామని తెలిపారు.

అరసాడలో అనధికార లేఅవుట్లు

వంగర: భూముల ధరలకు రెక్కలు రావడంతో అరసాడలో అనధికారలేఅవుట్లు వెలుస్తున్నాయి. రైతుల దగ్గర భూములు కొనుగో లు చేసిన కొంతమంది నిబంధ నలకు విరుద్ధంగా వాటిని రియల్‌ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. అరసాడలో 16 లేఅవుట్లు వెలిసినా ఇక్కడ రెండు లేఅవుట్లకు మాత్రమే నాలాచెల్లింపులు జరిగాయన్నది బహిరంగరహస్యం. రాజాం-వంగర రహదారిలో పంట భూములు లేఅవుట్లుగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేరు. పాలకొండకు చెందిన ఓ వైసీపీ నాయకుడి కుమారుడి కనుసన్నల్లో అరసాడలో ఈతతంగం జరుగుతుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.కాగా అరసాడలో అక్రమ లేఅవుట్లపై విచారణకు ఆదేశిస్తానని సూపరింటెండెంట్ సుందరరావు చెప్పారు.

మా శాఖలో సమస్యలు పరిష్కరించండి

- మంత్రికి విన్నవించిన అబ్కారీ, ప్రొహిబిషన్ శాఖ అధికారులు



మంత్రికి సమస్యలు తెలియజేస్తున్న అధికారులు

సాలూరు: తమ శాఖలో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించాలని ప్రొహిబిషన్, అబ్కారీ శాఖల అధికారులు మంత్రి గుమ్మిడి సంధ్యారాణిని కోరారు. ఈ మేరకు శనివారం సాలూరులోని తన నివాసంలో ఆమెను కలిసి, సమస్యలను విన్నవించారు. తమ శాఖలో ఉద్యోగుల కొరత ఉన్నప్పటికీ గత ప్రభుత్వం కొత్త నియామకాలు జరపకుండా ఉన్న శాఖని రెండు శాఖలుగా విభజించి తమపై బాధ్యతలు పెంచిందని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో మ్యాచింగ్ గ్రాంట్స్ విడుదల చేయకపోవటంతో వందల కోట్ల నిధులు కేంద్రం వద్ద ఆగిపోయాయని తెలిపారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ 'మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారం దిశగా ప్రయత్నం చేస్తా'నని చెప్పారు. గత ప్రభుత్వంలో పాడేరు, అరకు ప్రాంతాల్లో అమాయక గిరిజనులను గంజాయి మాదక ద్రవ్యాల కేసుల్లో ఇరికించి వారికి బెయిల్ ఇవ్వకుండా అన్యాయం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎస్.శ్రీనివాసరావు తోపాటు రెండు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మణికృష్ణకు అభినందనల వెల్లువ

పాలకొండ: ఫారెస్ట్ రేంజర్ ఆఫీసర్‌గా ఎంపికైన మణికృష్ణకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఉన్న యూత్ సభ్యులు మణికృష్ణకు దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉత్తరాంధ్ర ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాల కన్వీనర్ భరత్‌భూషణ్ మాట్లాడుతూ మణికృష్ణ యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అవినాష్‌బాబు, సంతోష్‌సాహు, పాఠకులు, గ్రంథాలయాధికారి బబ్బురు గణేష్‌బాబు, సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలను నివారిద్దాం

పాలకొండ: మోటార్ వెహికల్ చట్టాలను ప్రతిఒక్కరూ పాటించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించుకోవాలని పాలకొండ జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎ.విజయరాజ్‌కుమార్ అన్నారు. శనివారం పాలకొండ కోర్టులో మోటార్ వెహికల్ చట్టాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. అతివేగంగా డ్రైవింగ్ చేయకూడదని, మద్యం తాగి వాహనాలు నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో కోర్టు సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, లీలారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక చెట్టు పెంచాలి

జియ్యమ్మవలస: ప్రతిఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్కను నాటి దానిని పెంచాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సవరపు రమణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. శనివారం కళాశాలలో ఏక్ పేడ్ మాకే నామ్ అభియాన్ (అమ్మ పేరుతో ఒక చెట్టు) కార్యక్రమం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సంజయ్ చావ్లా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో లెక్చరర్లు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయిలో సమస్యలు గుర్తించాలి

భామిని: గ్రామ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని జనసేన మండల కన్వీనర్ ఆర్.కిరణ్‌కుమార్ కార్యకర్తలు, అభిమానులకు సూచించారు. శనివారం బిల్లుమడ జనసేన కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నూతనంగా ఏర్పడిన ఎన్‌డీఏ ప్రభుత్వానికి ప్రజల సమస్యలను తెలియజేసి గ్రామస్థాయిలో జనసేనను మరింత పటిష్ఠ పర్చాలన్నారు. గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. జనసేన నాయకులు అనిల్, మహేష్, వైకుంఠరావు, ఈశ్వరరావు, చందు, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించాలి

పాచిపెంట: అంగన్‌వాడీ వర్కర్ల సమస్యలను గుర్తించి పరిష్కరించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యదర్శి కె.పార్వతిదేవి కోరారు. ఈనెల 10న డిమాండ్స్ డే సందర్భంగా శనివారం పాచిపెంటలో అంగన్‌వాడీ కార్యకర్తలు కరపత్రాలు విడుదల చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 10న డిమాండ్స్ డే సందర్భంగా అంగన్‌వాడీ ఉద్యోగులు చేస్తున్నటువంటి సేవలను గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కనీస వేతనాలు అందించి మినీ వర్కర్లను మెయిన్ టీచరుగా గుర్తించాలని కోరారు. కరపత్రాలు విడుదల కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్.బంగారమ్మ, రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపూర్ణ అభియాన్ లక్ష్యాన్ని సాధించాలి

భామిని: కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన వెనుకబడిన మండలాలు సంపూర్ణ అభియాన్ లక్ష్యాన్ని సాధించాలని నీతి అయోగ్ పరిశీలకులు అనిత అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సంపూర్ణ అభియాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ మహేశ్వరరావు, డీటీవో డాక్టర్ వినోద్‌కుమార్, డీఈవో పగడాలమ్మ, వీర్రాజు, సత్యనారాయణ, రత్నకుమారి, ఎంపీడీఓ కిషోర్‌కుమార్, భాస్కరరావు, ప్రజాప్రతినిధులు కోట సింహాచలం, ధర్మారావు, కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన వర్షం



భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: మండలంలో ఈ ఏడాది వాతావరణం మార్పు వల్ల వర్షానికి ఎదురు చూస్తున్న రైతాంగానికి శనివారం సాయంత్రం వర్షం వల్ల కొంతమేర ఊరట నిచ్చింది. వరి ఎద, పత్తి మొక్కలు వాడిపోయిన సమయంలో ఈ వర్షం కురవడంతో మొక్కలకు ప్రాణం పోసినట్టు అయిందని రైతులు పేర్కొంటున్నారు. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం పొందారు.

ఒడిశా

'శత' శాతం పూర్తిచేయాలి

రాయగడ: ప్రజాహిత కార్యక్రమాల కోసం తలపెట్టిన 'వంద రోజుల కార్యక్రమం' శతశాతం పూర్తిచేయాలని పార్లమెంటు సభ్యుడు సప్తగిరి ఉలకా అన్నారు. ఈమేరకు శనివారం స్థానిక జడ్పీ సమావేశ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ మాట ప్రకారం ఆరోగ్యకార్డులు, రోగ నిరోధకత, ప్రసూతి సంరక్షణ, పాఠశాలల్లో విద్యుత్ సరఫరా, పుస్తకాలు, విద్యార్థులకు సప్లిమెంటరీ న్యూట్రిషన్ వంటి కార్యక్రమాలు ఈనెల 30 వరకు జరుగుతాయని తెలిపారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన సందర్శించారు. అందరం కలిసి ప్రధాని ఆకాంక్ష నెరవేర్చేందుకు కృషి చేద్దామన్నారు. ఈ మేరకు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కళ్యాణి సంఘమిత్ర దేవి, జడ్పీ అధ్యక్షురాలు సరస్వతి మాఝి, రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక పలు విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి

రాయగడ: శీతల యంత్రాల వినియోగం ఎక్కువ కావడంతో పర్యావరణ సమతుల్యతకు నష్టం వాటిల్లుతోందని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని కొరాపుట్ ఎంపీ సప్తగిరి ఉలకా అన్నారు. శనివారం స్థానిక రైల్వే అభినందన హాలులో అటవీ, పర్యావరణ, వాతావరణ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలే పర్యావరణ రక్షణకు చాలా ముఖ్యమని అన్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహాజన్, రాయగడ శాసనసభ్యుడు అప్పలస్వామి కద్రక, ఎస్పీ హరీష్ బీసీ, పురాధ్యక్షుడు మహేష్‌పట్నాయక్, అటవీ శాఖాధికారి సచిన్ అన్నా సాహెబ్ ఒహిలే, అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షరాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విజిలెన్స్ వలకు చిక్కిన తహసీల్దార్

రాయగడ: చంద్రపూర్ సమితి తహసీల్దార్ బిచిత్రనంద నాయక్ ఓ వ్యక్తి నుంచి రూ.లక్షా 15వేలు లంచం తీసుకుని రాయగడ వస్తున్న సమాచారం అందుకున్న విజిలెన్స్ అధికారులు అతనిని వెంబడించారు. విషయం తెలుసుకున్న నాయక్ తెలివిగా వారి నుంచి తప్పించుకునే ఉద్దేశంతో క్యాష్ బ్యాగును మార్గమధ్యంలో పొదల్లో విసిరివేసి రాయగడ చేరుకుని వారికి దొరక్కుండా దాక్కున్నాడు. అవినీతి శాఖాధికారులు పట్టువిడవకుండా నాయక్ ఆచూకీ తెలుసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

జంతువుల ఆరోగ్యమే లక్ష్యం

- జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి మన్మథరావు
- ప్రపంచ జూనోసిస్ దినోత్సవం
- పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు



పార్వతీపురంటౌన్: కుక్కల వ్యాక్సినేషన్ కార్యక్రమంలో జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి మన్మథరావు

పార్వతీపురంటౌన్: జంతువుల ఆరోగ్యమే లక్ష్యంగా పనిచేస్తున్నామని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి ఎస్.మన్మథరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పశువైద్యశాలలో శనివారం నిర్వహించిన ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కుక్కల నుంచి రోగాల సోకకుండా జంతు ప్రేమికులు ఆరోగ్యంగా ఉండే విధంగా విస్తృత ప్రచారం చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో రేబిస్ వ్యాధి నివారణకు 10,800 డోసులు పంపిణీ చేశామని చెప్పారు. జంతు ప్రేమికులు తమ కుక్కలకు ప్రతి ఏడాది నాళ్ల మందులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని పశువులకు గొంతువాపు టీకాలు 63,805, జబ్బువాపు 27,990 టీకాలు వేశామని ఆయన తెలిపారు. మేకలు, గొర్రెలకు చిటికె వ్యాధి రాకుండా లక్షా 49వేల808 టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, ప్రసాదరావులతో పాటు డాక్టర్ చక్రధర్ పాల్గొన్నారు. **పాలకొండ:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాలకొండ పశు వైద్యశాలలో శనివారం పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాధి నివారణ టీకాలను శనివారం వేశారు. సుమారు 40 పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశువైద్య శాఖ సహాయక సంచాలకుడు పి.మాణిక్యరావు మాట్లాడుతూ పెంపకందారులు తమ శునకాలకు సంవత్సరానికి ఒకసారి విధిగా రేబిస్ టీకాను వేయించుకోవాలన్నారు. **జియ్యమ్మవలస:** పశు పక్ష్యాదుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు సహజంగా వ్యాప్తి చెందుతున్న వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జియ్యమ్మవలస మండల పశు వైద్యాధికారి ఎన్.మునికుమార్ అన్నారు. ప్రంచ జూనోసిస్ డే సందర్భంగా శనివారం ఆయన పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్ చేశారు. కార్యక్రమంలో చినమేరంగి పశు వైద్య చికిత్సాలయ సిబ్బంది పాల్గొన్నారు. **గరుగుబిల్లి:** పెంపుడు కుక్కలకు తమ యజమానులు క్రమం తప్పకుండా రేబిస్ టీకాలను వేయించాలని మండల పశు వైద్యశాల సహాయ సంచాలకుడు బి.గణపతిరావు అన్నారు. మండల కేంద్రంలోని ఏరియా పశు వైద్యశాలలో శనివారం జూనోసిస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలను వేశారు. మండల పశు సంవర్ధకశాఖ అధికారి ఎస్.సురేష్ కుమార్, పశు వైద్య సిబ్బంది మంత్రబుడ్డి శ్రీరాములునాయుడు, దత్తి క్రాంతి, తదితరులు పాల్గొన్నారు. **మక్కువ:** ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో భాగంగా మక్కువ, శంబర పశు వైద్య కేంద్రాల వద్ద మండల పశువైదాధికారి కొట్టిశ పొలందొర ఆధ్వర్యంలో పెంపుడు కుక్కలకు శనివారం ఉచితంగా యాంటీ రాబిస్ వ్యాక్సిన్లు వేశారు. ఏహెచ్‌ఏ ఉమాదేవి, వీఏఎల్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. **సీతానగరం:** నిడగల్లు పశువైద్య కేంద్రంలో శనివారం ప్రపంచ జూనసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు టీకాలు వేశారు. పశు సంవర్ధక శాఖ వైద్యాధికారి రామారావు పాల్గొన్నారు. అలాగే సీతానగరం, బగ్గందరవలస పశువైద్య కేంద్రాల్లో టీకాలు వేశారు.

సొమ్ము సోకు ఒకరిది

- ప్రజాధనంతో వరహాల గెడ్డలో పూడికతీత
- మిన్నకున్న నీటి పారుదల శాఖ అధికారులు



వరహాల గెడ్డలో ఎక్స్‌కవేటర్‌తో వ్యర్థాలు తొలగిస్తున్న దృశ్యం

పార్వతీపురంటౌన్: కొన్నేళ్ల నుంచి జిల్లా కేంద్రం గుండా వెళ్తున్న వరహాల గెడ్డలోని వ్యర్థాలు, చెత్తాచెదరాలు తీసేందుకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు ప్రజాధనాన్ని వినియోగిస్తున్నారు. అయితే వరహాల గెడ్డతో పాటు పరివాహక ప్రాంతం నీటి పారుదల శాఖ నిర్వహణలో ఉంది. కానీ గత కొన్నేళ్ల నుంచి వర్షాకాలంలో వరహాల గెడ్డకు వచ్చే వరద కారణంగా పోలిశెట్టి రామ్మూర్తినగర్, సౌందర్య థియేటర్ వీధి, శత్రుచర్ల రియల్ ఎస్టేట్ కాలనీ, బైపాస్ కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు కనీసం పట్టించుకోకపోయినప్పటికీ ప్రజాప్రతినిధుల ఒత్తిడి మేరకు మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు గెడ్డలోని వ్యర్థాలను తొలగించేందుకు రూ.3లక్షల నుంచి రూ.4లక్షల వరకు ప్రజా ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. ఇదే వరహాల గెడ్డలో ఓ సినిమా థియేటర్‌కు వెళ్లేందుకు మార్గానికిగాను ఇరిగేషన్ శాఖాధికారులు వంతెన నిర్మాణం కోసం అనుమతులు ఇచ్చారు. దీనికి ఎమ్మెల్యే విజయచంద్రతో పాటు ప్రజా సంఘాలు వ్యతిరేకించాయి. దీంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఇరిగేషన్ శాఖాధికారులు కూడా వరహాల గెడ్డ నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా వరహాల గెడ్డ నిర్వహణ బాధ్యతలు ఇరిగేషన్‌శాఖ చూడాల్సి ఉందనేది వాస్తవం. వరదల కారణంగా ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడకూడదనే ఆలోచనతో వరహాల గెడ్డలో పూడికలను తీసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

జయకృష్ణకు వ్యతిరేకంగా పనిచేసివారిని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పాలకొండ: కూటమి ఎమ్మెల్యే అభ్యర్థిగా 2024 సార్వత్రిక ఎన్నికల్లో బరిలో నిలిచిన నిమ్మక జయకృష్ణకు వ్యతిరేకంగా పనిచేసిన పాలకొండ నియోజకవర్గంలోని టీడీపీ నాయకులను సస్పెండ్ చేయాలని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈ మేరకు శనివారం పాలకొండలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో టీడీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, పార్టీ సీనియర్ నాయకుడు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన వారిపై టీడీపీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీవారి నుంచి తాయిలాలు పొంది కూటమి అభ్యర్థి జయకృష్ణ విజయానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారని, దీనిపై పార్టీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అసమ్మతి వర్గంగా ముద్రపడిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పడాల భూదేవి, మాజీ జడ్పీటీసీ సామంతుల దామోదరరావు, పార్టీ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు ఖండాపు వెంకటరమణ, తదితరులను సస్పెండ్ చేయాలని పార్టీకి తీర్మానం చేసినట్టు తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండల పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, సవర తోట ముఖలింగం, జగదీష్, వెన్నపు శ్రీనివాసరావు, జాడ శ్రీధర్ పాల్గొన్నారు.

జిల్లా ప్రజల గుండెల్లో కలెక్టర్ చిరస్థాయిగా నిలిచిపోతారు

- ఎమ్మెల్యే విజయచంద్ర



కలెక్టర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: జిల్లా ప్రజల గుండెల్లో కలెక్టర్ నిశాంత్‌కుమార్ చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. బదిలీపై వెళుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు శనివారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ప్రజాప్రతినిధులు, అధికారులు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సభలో ఎమ్మెల్యే పాల్గొని, కలెక్టర్‌ను సన్మానించారు. జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి కలెక్టర్‌గా నిశాంత్‌కుమార్ అందించిన సేవలు మరువలేనివన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఏర్పడిన తర్వాత నేటి వరకు ఎంతో సంతృప్తికరంగా విధులు నిర్వహించానని చెప్పారు. ఇంతవరకు తనకు సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ విక్రాంత్ పాటిల్, జేసీ శోభిక, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, డీఆర్వో కేశవనాయుడు, ఆర్డీవో హేమలత, పాలకొండ ఆర్డీవోతో పాటు వివిధ శాఖల అధికారులు, జిల్లాలోని మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కోలా మధు, వేణు తదితరులు పాల్గొన్నారు.

'స్కిల్ ఇండియా'పై అవగాహన కల్పించండి

- జీసీసీ మేనేజింగ్ డైరెక్టర్ సురేష్



జీసీసీ ఎండీ సురేష్‌ను ఆహ్వానిస్తున్న వీడీవీకే సభ్యులు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో స్కిల్ ఇండియా పోర్టల్‌పై ఆదివాసీలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని గిరిజన సహకార సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ జి.సురేష్‌కుమార్ అన్నారు. మండ గ్రామంలో నిర్వహిస్తున్న వన్‌దన్ వికాస్ కేంద్రాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జన్మన్ పథకంలో చేరితే వచ్చే ప్రయోజనాలను సభ్యులందరికీ అవగాహన కల్పించారు. గిరిజన ప్రాంతాల్లో నిరుపేదలకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. వీడీవీకేల ద్వారా ఆర్థిక అభివృద్ధి పెంపొందించుకోవడానికి దృష్టి సారించాలన్నారు. అనంతరం తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సీతంపేటలో నిర్మించిన ఈ శ్రీవేంకటే శ్వర ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీసీ డివిజనల్ మేనేజర్ సంధ్యారాణి, వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ సన్యాసిరావు, జీసీసీ మేనేజర్లు దాసరి కృష్ణ, నరసింహులు, విజయకుమారి పాల్గొన్నారు.

ఆ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోండి



మాట్లాడుతున్న చంద్రశేఖర్

జియ్యమ్మవలస: విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మండలంలోని ఓ ప్రైవేటు పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గిరిజనాభ్యుదయ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆరిక చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన రావాడ రామభద్రపురం గ్రామంలో స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండల కేంద్రంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న గులిపల్లి మనోహర్ అనే ఐదో తరగతి విద్యార్థి శుక్రవారం సాయంత్రం స్కూల్ నుంచి తప్పించుకుని వెళ్లిపోయాడని చెప్పారు. శనివారం ఉదయం ఆ విద్యార్థి ఒడిశా రాష్ట్రం రాయగడ జిల్లా కేంద్రంలో కనిపించాడని తెలిపారు. విద్యార్థుల పట్ల ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆ యాజమాన్యానికి తగదని అన్నారు. దీనిపై కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి స్పందించి విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు సీతారాం, వెంకటరమణ పాల్గొన్నారు.

దివ్యాంగుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మాట్లాడుతున్న వేణుగోపాల్

మక్కువ: దివ్యాంగుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ అన్నారు. స్థానిక శ్రీరామా నర్సింగ్ హోం ఆవరణలో పీడబ్ల్యూడీ ఫెడరేషన్, దివ్యాంగుల పరిరక్షణా సేవా సమితి పార్వతీపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల పింఛన్ పెంపును హర్షిస్తూ సీఎం చంద్రబాబు, మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు రూ.6వేలు, పూర్తిస్థాయి దివ్యాంగులకు రూ.15వేలు పెంచడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఏసుదాసు, నాయకులు డాక్టర్ పి.మల్లేశ్వరరావు, చింతల తవిటినాయుడు, సీహెచ్ రామకృష్ణ, కేశవ్, దివ్యాంగులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచాలి

గుమ్మలక్ష్మీపురం: భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను పార్వతీపురం ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా 8, 9 తరగతుల విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. మెనూ సక్రమంగా అందిస్తున్నారా లేదా.. అని తెలుసుకున్నారు. అనంతరం వంటశాలలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన అధ్యాపకులకు సూచించారు.

విద్యకు పెద్దపీట..

భామిని: ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని.. దీనిని విద్యార్థులు వినియోగించుకోవాలని డీఈవో పి.పగడాలమ్మ హితవు పలికారు. భామిని పీఎం ఆదర్శ పాఠశాలను శనివారం ఆమె సందర్శించి విద్యా ప్రమాణాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రఘుపాత్రుని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేలా చూడండి

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులందరూ సమీప పాఠశాలలకు వెళ్లేలా హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు బాధ్యతతో చూడాలని పార్వతీపురం ఐటీడీఏ డీడీ రుగ్మండయ్య సూచించారు. స్థానిక ఏకలవ్య పాఠశాలలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాల్లో ఉన్న గిరిజన సంక్షేమ పాఠశాల హెచ్ఎంలు, డిప్యూటీ వార్డెన్లతో శనివారం సమావేశం నిర్వహించారు. 14 ఏళ్లలోపు వయస్సు ఉన్న బాల బాలికలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఏఎంవో మోహన్‌రాయుడు, ఏటీడబ్ల్యూవో సురేష్‌కుమార్, ఎంఈవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

పాచిపెంట: మండల కేంద్రంలోని వేంకటేశ్వర ఎరువుల దుకాణాన్ని రాష్ట్ర విజిలెన్స్ కమిటీ శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించింది. ఈ కమిటీలో విజిలెన్స్ సీఐ సీహెచ్ తిరుపతిరావు, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌జేవీ రామ్‌మోహనరావు ఉన్నారు. రికార్డులను పరిశీలించి, ఎరువుల నిల్వలను తనిఖీ చేశారు. నిల్వలు సక్రమంగా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రామ్‌మోహనరావు మాట్లాడుతూ సాలూరులో ఎరువుల దుకాణం తనిఖీ చేయగా రైతులకు ఇచ్చే బిల్లుల్లో తేడా ఉందన్నారు. ఈ మేరకు 113.67 టన్నుల ఎరువులను నిలుపుదల చేశామని తెలిపారు. వీటి విలువ రూ.34.92 లక్షలు ఉంటుందని చెప్పారు. జిల్లాలో ఎరువులు దుకాణాలు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. తనిఖీలు అనంతరం ఏ రోజుకు ఆ రోజు వ్యవసాయశాఖ కమిషనర్‌కు నివేదిక సమర్పిస్తున్నామని తెలిపారు. విజిలెన్స్ కమిటీతో పాటు స్థానిక వ్యవసాయశాఖ అధికారి కె.తిరుపతిరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా..

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతి

గుమ్మలక్ష్మీపురం/ జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మండలం రావాడ రామభద్రాపురం గ్రామంలోగల గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత ఆశ్రమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బిడ్డిక ఈశ్వరరావు శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్టు హెచ్ఎం ఎస్.తిరుపతిరావు శనివారం తెలిపారు. గుమ్మలక్ష్మీపురం మండలం బలేష్ పంచాయతీ బయ్యాడ గ్రామానికి చెందిన ఈశ్వరరావు తమ పాఠశాలలో ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడని హెచ్ఎం చెప్పారు. అయితే వేసవి సెలవులు అనంతరం పాఠశాల పునఃప్రారంభం అయిన తర్వాత కూడా ఆ విద్యార్థి ఇంకా పాఠశాలకు హాజరు కాలేదని ఆయన చెప్పారు. శుక్రవారం సాయంత్రం ఈశ్వరరావు తన స్వగృహంలోనే అనారోగ్యంతో మృతిచెందాడని హెచ్ఎం తెలిపారు.

నేడు పార్వతీపురంలో బయోలజీ ఫోరం సదస్సు

సాలూరు రూరల్: పార్వతీపురం బ్రాంచ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు బయోలజీ ఉపాధ్యాయులతో బయోలజీ ఫోరం సదస్సు నిర్వహిస్తున్నట్టు నల్లా బాలకృష్ణ, పెంట రామకృష్ణలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బాలికల గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భామిని: భామినిలోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ విజయనిర్మల కోరారు. ఈ నెల 8లోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. 5వ తరగతికి 31, ఆరో తరగతికి 22, ఎనిమిదో తరగతికి 12, తొమ్మిదో తరగతికి 10, ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ 26, హెచ్ఈసీ 20, దళిత బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఐదో తరగతికి బీసీలు 2, ఓసీ 1, ఆరో తరగతికి బీసీ, ఓసీలకు చెరో ఒకటి, 7వ తరగతికి బీసీలు రెండు, ఓసీ ఒకటి, 8, 9, 10 తరగతులకు చెరో ఒకటి ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు సోమవారం నాటికి పాఠశాలకు వచ్చి సంప్రదించాలన్నారు.

9న ఉపాధి పనులపై ప్రజావేదిక

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనులపై ఈనెల 9న స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ప్రజావేదిక నిర్వహిస్తున్నట్టు మండల ఉపాధి ఏపీవో ఎం.గౌరీనాథ్, సామాజిక తనిఖీ విభాగం ఎస్ఆర్‌పీ బి.దాసు తెలిపారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. గతేడాది ఏప్రిల్ 1నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు రూ.19.16కోట్లతో చేపట్టిన పనులకు సంబంధించి 11 మంది డీఆర్‌పీలతో పాటు గ్రామ స్థాయి అధికారులు సామాజిక తనిఖీలు చేపట్టారని చెప్పారు. ప్రజావేదిక కార్యక్రమానికి ప్రజాప్రతినిధులతో పాటు సంబంధిత శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, ఆరాధన, మంగళ శాసనములు, విశేష హోమాలు, తదితర పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించామని దేవస్థానం ఈవో వీవీ సూర్యనారాయణ చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథస్వామికి..

వీరఘట్టం: వీరఘట్టం పట్టణంలోని జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా శనివారం నేత్రోత్సవం, చక్రతీర్థ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు లింగరాజు ప్రసాద్‌రథ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భూ పట్టాల జాప్యంపై గిరిజనుల నిరసన



బట్టివలసలో నిరసన వ్యక్తం చేస్తున్న గిరిజనులు

సాలూరు రూరల్: తమకు భూ పట్టాలివ్వడంతో ప్రభుత్వం జాప్యం చేయడం పట్ల బట్టివలస గిరిజనులు శనివారం సీపీఎం నేత మర్రి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం సాలూరు మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గిరిజనులకు భూ పట్టాలిస్తామని వైసీపీ ప్రభుత్వం సర్వే చేసి నెలలు దాటినా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పట్టాలివ్వకుంటే గిరిజన రైతులతో కలసి పోరాటాలకు సిద్ధమవుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు వంతల శివ, చిన్న, రాజు, తులసి తదితరులు పాల్గొన్నారు.

